TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 110 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | గురువారం 26 సెప్టెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## మేకిన్ ఇండియా ఫలాలు.. ప్రధాని మోదీ కలలు నెరవేరుతున్నాయి..!




ఢిల్లీ / శాసనసభ : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'మేక్ ఇన్ ఇండియా క్యాంపెయిన్' నేటితో (సెప్టెంబర్ 25) 10 ఏళ్లు పూర్తి చేసుకుంది.ఈ ప్రత్యేక సందర్భంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన X - పోస్ట్‌లో ఒక దశాబ్దం పూర్తి చేసుకున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



# హైడ్రా దెబ్బతో కొత్త డౌట్..

# ప్రాపర్టీ లేనప్పుడు లోన్స్ రికవరీ ఎలా..?

- కొనుగోలు చేసిన వారిలో ఆందోళన
- ఆర్బీఐ గైడ్ లైన్స్ ప్రకారమే: బ్యాంకులు
- ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధి ఎలా తెలుస్తుంది?
- రుణాల రికవరీ ఎలా?

**శాసనసభ / హైదరాబాద్ :** లేక్ వ్యూ, రివర్ వ్యూ పేరిట హైదరాబాద్, చుట్టు పక్కల అపార్ట్ మెంట్లు, విల్లాలు, ఇండ్లు నిర్మించారు. అన్ని పరిశీలించిన తర్వాతే హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులు వీటికి అనుమతులు జారీ చేశారు.నీటి పారుదలశాఖ అధికారులు ఎన్వోసీలు ఇచ్చారు. వీటి నిర్మాణానికి సంస్థలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నాయి. వినియోగదారులూ బ్యాంకుల నుంచి లోన్లు తీసుకొని ఫ్లాట్లు బుక్ చేస్తున్నారు. ఇప్పుడు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఇవి ఉన్నాయంటూ హైడ్రా ఈ నిర్మాణాలను కూల్చివేస్తున్నది. ఈ నేపథ్యంలో.. అక్కడ ప్రాపర్టీయే లేనప్పుడు సంస్థలు, వ్యక్తుల నుంచి రుణాల రికవరీ ఎల్ఐసీ హౌజింగ్ వంటి ఫైనాన్షియల్ సంస్థలకు, జాతీయ బ్యాంకులకు సాధ్యమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వివరాలు »»2లో

## లెబనాన్ - ఇజ్రాయెల్ సరిహద్దుల్లో మోహరించిన భారత సైన్యం..



మిడిల్ ఈస్ట్‌లో ఇజ్రాయెల్ హిజ్బుల్లా మధ్య ఘర్షణలు పెరుగుతున్న నేపథ్యంలో, శాంతి పరిరక్షక దళంలో భాగంగా ఇజ్రాయెల్ లెబనాన్ దేశాల సరిహద్దులో మోహరించిన భారత సైన్యం అక్కడి పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది.

వివరాలు »»2లో

## నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలి : సీఎం రేవంత్ రెడ్డి



- » ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సచివాలయంలో సమీక్ష
- » దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశం
- » డబుల్ బెడ్‌రూం ఇళ్ళను లబ్ధిదారులకు అప్పగించాలని సూచన

**శాసనసభ / హైదరాబాద్:** నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులకు వాటిని అప్పగించాలని సూచించారు.


## హైడ్రా బుల్డోజర్లకు అడ్డంగా నేను ఉంటాను




**శాసనసభ / హైదరాబాద్ :** అకస్మాత్తుగా బుల్డోజర్లతో వచ్చి పేదల ఇళ్లను కూలుస్తున్న హైడ్రాపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.హైదరాబాద్ నగరంలో హైడ్రా భాదితులందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుందని ప్రకటించారు. తాను బుల్డోజర్లకు అడ్డంగా ఉంటానని కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్ హయాంలో 40 వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించినట్లు తెలిపారు. హైడ్రా బాధితులకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.'కూకట్‌పల్లి నియోజకవర్గం లో ప్రభుత్వ భూములను అమ్మేందుకు రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నాడు. ఎన్ కన్వెన్షన్‌కు అనుమతి కాంగ్రెస్ ఇచ్చింది. జీహెచ్ఎంసీ, బుద్ధ భవన్ నాలాలపైనే ఉన్నాయి. మంత్రుల ఇండ్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నాయి. ముందు వీటిని కూల్చండి' అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు.

వివరాలు »»2లో

## ప్రపంచంలోనే అతి పెద్ద డ్యామ్. మనందరికీ ప్రమాదం



బీజింగ్: అది ప్రపంచంలోనే అతి పెద్ద డ్యామ్. మూడు నదులు ఒకచోట కలిసే ప్రాంతంలో నిర్మించారు. డ్యాం పూర్తి కావడంతో తమ వద్ద అత్యాధునిక సాంకేతిక, ఇంజినీర్లు ఉన్నారని గొప్పగా చెప్పుకున్నారు.లక్షల ఎకరాల్లో సాగు, తాగు నీరు అందించేలా చేశారు. కానీ..

## 28న తిరుమలకు జగన్ రాష్ట్ర వ్యాప్తంగా, తాజా నిర్ణయం..!!



**అమరావతి / శాసనసభ :** మాజీ ముఖ్యమంత్రి జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 28న తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని నిర్ణయించారు. లడ్డూ వివాదం వేళ అదే రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో పూజలు నిర్వహించాలని పార్టీ శ్రేణులతో పాటుగా ప్రజలకు పిలుపునిచ్చారు.లడ్డూ వివాదంలో జగన్ పైన కూటమి ప్రభుత్వం ఆరోపణలు చేస్తున్న ఈ సమయంలో జగన్ నిర్ణయం కీలకంగా మారుతోంది.

## హైడ్రా వల్ల ప్రశాంతత లేదు... నిద్రలేకుండా పోయింది



- హైడ్రా నుంచి తనకూ నోటీసులు వచ్చాయన్న మల్లారెడ్డి
- తన కాలేజీలను కాంగ్రెస్ హయాంలోనే కట్టానని వెల్లడి
- తెలంగాణలో ప్రజలను హైడ్రా హైరానాకు గురి చేస్తోందని వ్యాఖ్య

## ఢిల్లీ లిక్కర్ కేసు.. కోర్టు విచారణకు హాజరైన కవిత



- సీబీఐ ఛార్జ్ షీట్ పై విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు
- వర్చువల్ గా కోర్టు విచారణకు హాజరైన కవిత
- తదుపరి విచారణ అక్టోబర్ 4వ తేదీకి వాయిదా

## ముందంజలో దూసుకెళ్తోన్న కమలాహారిస్.. తాజా సర్వేలో ఎన్ని ఓట్లు వచ్చాయంటే..!



అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసులో కమలాహారిస్ దూసుకెళ్లిపోతున్నారు. తాజా సర్వేలో ఆమె ముందంజలో ఉన్నారు. డెమొక్రాట్ అభ్యర్థిగా కమలాహారిస్.. రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ బరిలో ఉన్నారు.నవంబర్‌లోనే అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి.

వివరాలు »»3లో




## సీబీఐ విచారణ కోరుతున్న వైసీపీ... కౌంటర్ ఇచ్చిన మంత్రి నారా లోకేశ్

వివరాలు »»2లో

శాసనసభ
తెలుగు దినపత్రిక
గురువారం 26 సెప్టెంబర్ - 2024

( మొదటి పేజీ తరువాయి )

# ప్రపంచంలోనే అతి పెద్ద డ్యామ్. మనందరికీ ప్రమాదం



ఆ డ్యామ్ వల్ల మానవాళి మనుగడే ప్రమాదంగా మారుతుందని గుర్తించలేకపోయారు. నీటి ఒత్తిడి భరించలేక భూభ్రమనంలో మార్పులు వస్తున్నాయంటే డ్యామ్ ఏ స్థాయి ప్రభావం చూపిస్తుందో అర్థం చేసుకోవచ్చు. చైనాలో ఉన్న త్రీగోర్జెస్ డ్యామ్ గురించే ఇదంతా. ఈ డ్యామ్‌తో సమస్త మానవాళికే ముప్పు పొంచి ఉందని బ్రిటన్ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల భూ గమనంలో మార్పులు సంభవిస్తున్నాయని, ఇది మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. సూర్యుడి నుంచి దూరంగా..చైనాలోని యాంగ్జీ నదిపై సుమారు 2.33 కి.మీ పొడవు, 181 మీటర్ల ఎత్తులో త్రీగోర్జెస్ డ్యామ్‌ను నిర్మించారు. ఇది అందుబాటులోకి వచ్చిన తర్వాత యాంగ్జి నదిలో పెద్ద మొత్తంలో నీరు నిల్వ ఉన్న కారణంగా భూ పరిభ్రమణ వేగం 0.06 మైక్రో సెకన్లు తగ్గిపోయిందని శాస్త్రవేత్తలు ఆ మధ్య చెప్పారు. దీనికితోడు యాంగ్జీ ప్రభావంతో సూర్యుడి నుంచి భూమి 2 సెంటీమీటర్ల దూరం జరిగిందని వివరించారు. దీని ప్రభావం అంతకంతకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2004లో హిందూ మహా సముద్రంలో సునామీ వచ్చినప్పుడు భూ గమనంలో మార్పు కనిపించింది. భూమిపై భారీగా మార్పులు చోటు జరుగుతున్నప్పుడు దాని ప్రభావం భూగమనంపై పడుతుంది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. భూకంపం ధాటికి రోజు నిడివి సుమారు 2.68 మైక్రోసెకన్లు తగ్గిపోయింది. త్రీ గోర్జెస్ డ్యామ్ వల్లా భూమి కదలికల్లో అనేక మార్పులు వస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. 3 నదుల నీరు ఒకేచోట..త్రీ గోర్జెస్ డ్యామ్‌కు మూడు వేర్వేరు నదుల నుంచి నీరు వచ్చి చేరుతోంది. సుమారు 39.3 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు డ్యామ్‌లో నిల్వ ఉంటోంది. ఒక్క నది ప్రవాహమే మనకు ప్రళయంలా అనిపిస్తుంటుంది. అలాంటిది మూడు నదులు కలిసే చోట డ్యామ్ నిర్మించారంటే అర్థం చేసుకోవచ్చు భూమిపై ఎంత భారీగా ఒత్తిడి పడుతుందోనని. ఆ స్థాయిలో ఒకేచోట నీరు చేరడం భూమిపై నేరుగా ప్రభావం చూపిస్తోంది. అంతరిక్షం నుంచి సాధారణ కంటికి కనిపించే నిర్మాణాల్లో త్రీ గోర్జెస్ డ్యామ్ ఒకటి.

ఈ డ్యాం కింద 22 వేల 500 మెగావాట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి చేస్తారు. ప్రపంచంలోనే అతిపెద్దవైన మూడు అణువిద్యుత్తు కేంద్రాల ఉత్పత్తికి ఇది సమానమన్నమాట. డ్యామ్‌లో నీటి నిల్వ కారణంగా భూమి అడుగున ఒత్తిడి పెరిగి భూకంపాలు సంభవించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్యామ్ నిర్మాణం కోసం114 పట్టణాలను, 1,680 గ్రామాలను చైనా తరలించింది. 14 లక్షల మంది నిర్వాసితులకు పునరావాసం కల్పించింది. ప్రాజెక్టు మొత్తం నిర్మాణానికి 203 చైనీస్ యువాన్‌లు ఖర్చు అయింది. 1994లో పనులను ప్రారంభించి 2006లో పూర్తి చేశారు.

## హైడ్రా వల్ల ప్రశాంతత లేదు... నిద్రలేకుండా పోయింది: మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు



మాజీ మంత్రి, మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. హైడ్రా వల్ల ఎవరికీ ప్రశాంతత లేదని, నిద్రలేకుండా పోయిందని వ్యాఖ్యానించారు. హైడ్రా నుంచి తనకూ నోటీసులు వచ్చాయని తెలిపారు. యాదగిరిగుట్టలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తన కాలేజీలను కాంగ్రెస్ హయాంలోనే నిర్మించానని వెల్లడించారు. ఇళ్లను కూల్చి ప్రజలను రోడ్ల మీద పడేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు సహజమే అన్నారు. తెలంగాణలో హైడ్రా ప్రజలను హైరానాకు గురి చేస్తోందన్నారు. ప్రజల దృష్టి మరల్చడానికే హైడ్రాను ప్రయోగిస్తున్నారని విమర్శించారు. ఇళ్లను కూల్చివేసి ప్రజలను రోడ్లపై పడేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏదో యుద్ధం చేసినట్లుగా ఇళ్లను కూల్చివేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టడమే కాంగ్రెస్ నేతలు పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తాను ఓ సవాల్ చేస్తున్నానని, కేసీఆర్ పాలనలో పండించిన పంట కంటే ఎక్కువ పంట పండిస్తే కాంగ్రెస్ వాళ్లకు పాలాభిషేకం చేస్తానన్నారు. రేవంత్ పాలనలో రైతు భరోసా లేదని, రుణమాఫీ పూర్తి కాలేదన్నారు. మంత్రుల మధ్య కూడా సఖ్యత లేదని వ్యాఖ్యానించారు.

## 28న తిరుమలకు జగన్ - రాష్ట్ర వ్యాప్తంగా, తాజా నిర్ణయం..!!



శ్రీవారి దర్శనం కోసం తిరుమల లడ్డూ వివాదం వేళ సీఎం జగన్ వరుస నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇదే అంశం పైన పార్టీ ముఖ్య నేతలతో జగన్ చర్చించారు. రాజకీయ దురుద్దేశంతోనే సీఎం చంద్రబాబు ఈ తరహా ఆరోపణలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికే ఈ అంశం పైన విచారణ కోరుతూ డిమాండ్ చేసిన అంశాన్ని జగన్ ప్రస్తావించారు. ప్రధాని, సుప్రీం ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖల గురించి వివరించారు. ఈ నేపథ్యం లో తాను ఈ నెల 28న తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకోవాలని నిర్ణయించారు. 28న రాష్ట్ర వ్యాప్తంగా అదే సమయంలో ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో పూజలు నిర్వహించాలని కోరుతూ జగన్ సోషల్ మీడియా వేదికగా ఒక సందేశం విడుదల చేసారు. అందులో.. తిరుమల పవిత్రతను,స్వామివారి ప్రసాదం విశిష్టతను,వెంకటేశ్వరస్వామి వైభవాన్ని తగ్గించేలా, టీటీడీ పేరు ప్రఖ్యాతులను,వేంకటేశ్వరస్వామి ప్రసాదమైన లడ్డూ పవిత్రతను, రాజకీయ దుర్బుద్ధితో, కావాలని అబద్ధాలాడి, జంతువుల కొవ్వుతో కల్తీ జరగనిది జరిగినట్టుగా ప్రచారం చేస్తున్నారని వివరించారు. అన్ని ఆలయాల్లో పూజలు ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్టుగా, అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబుగారు తిరుమలను, తిరుమల లడ్డూను, వేంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేసినందుకు, చంద్రబాబుగారు చేసిన ఈ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో సెప్టెంబరు 28, శనివారం రోజున పూజల్లో పాల్గొనాలని వైయస్సార్‌సీపీ పిలుపునిస్తోందని పేర్కొన్నారు. అదే రోజున జగన్ తిరుమల శ్రీవారిని దర్శించు కొనేందుకు తిరుమల వెళ్లాలని నిర్ణయించటం ఇప్పుడు ఆసక్తి కరంగా మారుతోంది.

## లెబనాన్ - ఇజ్రాయెల్ సరిహద్దుల్లో మోహరించిన భారత సైన్యం..



లెబనాన్‌లో ఇటీవల జరిగిన పేజర్ పేలుడు హిజ్బుల్లా, ఇజ్రాయెల్ లను యుద్ధం అంచున ఉంచింది. కాగా, శాంతిభద్రతల పరిరక్షణలో భారత సైన్యం కీలక పాత్ర పోషిస్తోంది. ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక మిషన్ కింద భారత సైన్యం సమస్యాత్మక ఇజ్రాయెల్ లెబనాన్ సరిహద్దులో మోహరించింది. లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య సరిహద్దుగా ఉన్న బ్లూ లైన్‌లో దాదాపు 600 మంది భారతీయ సైనికులు మోహరించారు. ఈ దళం లెబనాన్ లోని ఐక్యరాజ్యసమితి మధ్యంతర దళం లో భాగం. ఇది యుద్ధ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించడానికి అంకితం చేయబడింది. ఐక్యరాజ్యసమితి మధ్యంతర దళం ఇన్ లెబనాన్ మిషన్‌లో భాగంగా దాదాపు 600 మంది భారతీయ సైనికులు ఇజ్రాయెల్-లెబనాన్ సరిహద్దు వెంబడి మోహరించారు. ఈ అస్థిర ప్రాంతంలో వారి పాత్ర నేరుగా సంఘర్షణలో పాల్గొనకుండా శాంతిని కాపాడుకోవడం మరియు కవ్వింపులను నిరోధించడంపై దృష్టి పెడుతుంది. రక్షణ వర్గాల సమాచారం ప్రకారం, భారత సైనికులు మోహరించిన మైదానంలో పరిస్థితిని భారత సైన్యం నిశితంగా పరిశీలిస్తోంది. బ్లూ లైన్ అంటే శాంతి పరిరక్షక జోన్‌గా పనిచేస్తుంది. ఇంకా ఇజ్రాయెల్ %-% లెబనాన్ మధ్య వివాదం పెరగకుండా నిరోధించడానికి దళాలు పని చేస్తాయి. భారత సైనికులు చురుకైన పోరాటంలో పాల్గొననప్పటికీ, అత్యంత సున్నితమైన ఈ ప్రాంతంలో స్థిరత్వాన్ని కాపాడే బాధ్యత వారిదే. సిబ్బంది, శాంతి పరిరక్షక కార్యకలాపాలను రక్షించడం అలాగే సరిహద్దు వెంబడి హింస చెలరేగకుండా నిరోధించడం వారి ప్రాథమిక లక్ష్యం.

## సీబీఐ విచారణ కోరుతున్న వైసీపీ... కౌంటర్ ఇచ్చిన మంత్రి నారా లోకేశ్



తిరుపతి లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందన్న ఆరోపణలపై వైసీపీ భగ్గుమంటోంది. తాము ఏ తప్పు చేయలేదని వైసీపీ నేతలు ప్రమాణాలకు సై అంటున్నారు. కావాలంటే ఈ వ్యవహారంలో సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మంత్రి నారా లోకేశ్ కౌంటర్ ఇచ్చారు. సీబీఐ విచారణ పట్ల వైసీపీ వాళ్లకు అంత ప్రేమ ఉంటే... బాబాయి హత్యపై జగన్ ఎందుకు సీబీఐ విచారణ వేయలేదని సూటిగా ప్రశ్నించారు. "సీబీఐ విచారణ వేయాలని సునీత గారే అడిగారు కదా... మరి ఎందుకు వేయలేదు? అంతేకాకుండా, సీబీఐ కోర్టుకు వెళ్లకుండా జగన్ ఎందుకు ఎగ్గొడుతున్నాడు? వైవీ సుబ్బారెడ్డి గారు తిరుమలలో ప్రమాణం గురించి చాలెంజ్ చేశారు... ఆ తర్వాత నేను తిరుపతి వెళ్లాను... 24 గంటలు నేను ఇక్కడే ఉంటాను సర్... మీరు రండి అని చెప్పాను... వాళ్లు ఎందుకు రాలేదు? మార్కెట్ ధర కంటే 40 శాతం తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేశారంటే దాని అర్థం ఏంటండీ? తప్పును కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తుండడం చాలా బాధాకరం. నెయ్యి కల్తీకి సంబంధించి డాక్యుమెంట్లు, నివేదికలు, టెండర్ల ప్రక్రియ ఎలా జరిగిందనే విషయాలు అన్నీ బహిర్గతం చేశాం... దీనిపై మేం సిట్ వేస్తున్నాం. గతంలో కనీసం రూ.250 కోట్ల టర్నోవర్ ఉన్న సంస్థ నుంచే కొనుగోలు చేయాలన్నారు... దాన్ని రూ.150 కోట్లకు తగ్గించింది ఎవరు? వైసీపీ ప్రభుత్వమే కదా! ఇవన్నీ తగ్గించారు కాబట్టే లడ్డూ నాణ్యత లేకుండా పోయింది... తద్వారా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి... అది మనందరం అర్థం చేసుకోవాలి.. ఇలాంటప్పుడు చేయాల్సింది రాజకీయం కాదు" అని లోకేశ్ పేర్కొన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## మేకిన్ ఇండియా ఫలాలు.. ప్రధాని మోదీ కలలు నెరవేరుతున్నాయి..!




దీంతోపాటు, ఈ ప్రచారాన్ని విజయవంతం చేయడానికి నిరంతరం కృషి చేసిన వారందరినీ కొనియాడారు. గడచిన దశాబ్ద కాలంగా దీక్ష విజయవంతం కావడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన వారికి ప్రధాన మంత్రి తన కృతజ్ఞతలు తెలిపారు. భారత్ మారుతోంది. ఒప్పుడు ఎన్నో దిగుమతులు.. ఇప్పుడు అన్నీ ఉత్పత్తులే. మేకిన్ ఇండియా నినాదం క్రమంగా ప్రతిఫలాలను ఇస్తోంది. ప్రధాని మోదీ కలలు సాకారమవుతుండడంతో పాటు.. దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోంది. 2014లో ప్రతిష్టాత్మకంగా మేకిన్ ఇండియాను లాంచ్ చేశారు మోదీ. భారత్‌ను ప్రపంచంలో టాప్ ఉత్పత్తి దేశంగా మార్చేందుకు కలలు కన్నారు. దీనికోసం పక్కా ప్రణాళికలతో ముందుకు సాగారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు దాని ప్రతిఫలాలను దేశం చూస్తోంది. 2014లో దేశంలో 80శాతం మొబైల్ ఫోన్లను దిగుమతి చేసుకునే పరిస్థితుల్లో ఉంటే.. ఇప్పుడు 99.9శాతం మొబైల్స్ ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. అంతేకాదు.. యూకే, నెదర్లాండ్స్, ఆస్ట్రియా, ఇటలీ, సౌతాఫ్రికా వంటి దేశాలకు ఎగుమతులు కూడా సాగుతున్నాయి. డిఫెన్స్ ప్రొడక్షన్‌తోపాటు.. అంతరిక్షం, ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్ల తయారీ, నిర్మాణ రంగం, రైల్వే ఇన్‌ఫ్రాలోనూ అద్భుత ఫలితాలను సాధిస్తోంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ X (గతంలో ట్విట్టర్), ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో 140 కోట్ల మంది భారతీయుల పాత్రను ప్రధాని మోదీ అంగీకరించారు. 10 సంవత్సరాల క్రితం సెప్టెంబరు 25, 2014న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ చొరవ, తయారీపై భారతదేశం పునరుద్ధరణ దృష్టిని లక్ష్యంగా చేసుకుంది. భారతదేశాన్ని అత్యంత ఇష్టపడే ప్రపంచ తయారీ కేంద్రంగా ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశ్యం. పెట్టుబడులను ఆకర్షించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, అత్యున్నత స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించడం ద్వారా భారతదేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉంచడం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ రంగాలలో ఎగుమతులను పెంచడంలో సహాయపడింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది. ప్రపంచ వేదికపై భారతీయ వ్యాపారాలు తమ సామర్థ్యాలను ప్రదర్శించడానికి అవకాశాలను సృష్టించింది. 'మేక్ ఇన్ ఇండియా' వెనుక ఉన్న విశాల దృక్పథాన్ని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## హైడ్రా బుల్డోజర్లకు అడ్డంగా నేను ఉంటాను




హైడ్రా కూల్చివేతలపై కాంగ్రెస్ నేతలకు ఒక న్యాయం.. పేదలకు మరొక న్యాయమా? అని ప్రశ్నించారు. నగర ఎమ్మెల్యేలతో చర్చించి హైడ్రాపై ఒక నిర్ణయానికి వస్తామని చెప్పారు. పేదల పట్ల హైడ్రా ప్రతాపానికి వేదశ్రీ అనే బాలిక ఒక ఉదాహరణ అని ఆవేదన వ్యక్తం చేశారు. పబ్లిసిటీ స్టంట్లతో రేవంత్ ఎక్కువ కాలం ప్రభుత్వాన్ని నడపలేరని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తమ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఎస్టీపీలను కేటీఆర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరుల బృందం పర్యటించింది. కూకట్‌పల్లిలోని ఫతేనగర్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఎస్టీపీని పరిశీలించారు. 'హైదరాబాద్‌ను మురుగు నీటి రహిత నగరంగా మార్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం గొప్ప లక్ష్యంతో ఈ కార్యక్రమాలను ప్రారంభించింది. రూ.3,866 కోట్లతో భారీ ఎత్తున మురిగినీటి శుద్ధి కార్యక్రమం చేపట్టాం. ఎస్టీపీల నిర్మాణం పూర్తయితే మురుగునీటిని వంద శాతం శుద్ధి చేస్తున్న నగరంగా హైదరాబాద్ గణత సాధిస్తుంది' అని కేటీఆర్ తెలిపారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్టీపీల నిర్మాణంలో వేగం తగ్గింది. హైదరాబాద్ ప్రజలను మురికినీటికి దూరం చేసే ఈ కార్యక్రమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇచ్చి వెంటనే పూర్తిచేసేలా ప్రయత్నం చేయాలి. హైదరాబాద్ ప్రజల కోసం బీఆర్ఎస్ చేసిన గొప్ప కార్యక్రమం ఎస్టీపీల నిర్మాణం' అని కేటీఆర్ వివరించారు. మూసీ సుందరీకరణను సీఎం రేవంత్ పాకిస్తాన్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 'మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్ల కుంభకోణం జరుగుతోంది' అని ఆరోపించారు. కొత్తగా మూసీని శుద్ధి చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన ఎస్టీపీలను ఉపయోగించుకుంటే సరిపోతుందన్నారు. 'మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రుల మాటలకు పొంతన లేదు. మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అస్సలు ఉద్దేశం వేరే ఉంది' అని తెలిపారు.

# హైడ్రా దెబ్బతో కొత్త డౌట్.. ప్రాపర్టీ లేనప్పుడు లోన్స్ రికవరీ ఎలా..?



### కొనుగోలు చేసిన వారిలో ఆందోళన

హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఫ్లాట్లు, విల్లాలు కొనుగోలు చేసిన వారిలో ఆందోళన కనిపిస్తున్నది. సొంతగా కూడగట్టుకున్న డబ్బుతోపాటు బ్యాంకు నుంచి తీసుకున్న రుణమూ పోయిందని చాలా మంది వాపోతున్నారు. రుణాలు కట్టకుంటే సిబిల్ స్కోర్ సైతం పడిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. అన్ని అనుమతులు ఉన్నాయంటే రూ.కోట్లు పెట్టి ఫ్లాట్స్ బుక్ చేసుకున్నామని, ఇప్పుడు తమ పరిస్థితి ఏం కావాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే హైడ్రా అనేక ప్రాంతాల్లో అపార్ట్ మెంట్లు, విల్లాలను కూల్చివేసింది. వాటికి అడ్వాన్సులు ఇచ్చి, రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు తమ డబ్బులు పోతాయా? వస్తాయా? అంటూ ఆరా తీస్తున్నారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులను సంప్రదిస్తున్నారు. ఇంకొందరేమో సైట్ దగ్గరికి వెళ్లి, డెవలపర్స్ ఆఫీసులకు వెళ్లి ప్రశ్నిస్తున్నారు.

### ఆర్బీఐ గైడ్ లైన్స్ ప్రకారమే: బ్యాంకులు

'హోమ్ లోన్స్ విషయంలో ఒక ప్రొసీజర్ ఉంటుంది. దాని ప్రకారం అన్నింటినీ వెరిఫై చేస్తారు. ప్రతి క్లయింట్ ఫైల్ ని నిశితంగా పరిశీలిస్తారు. లీగల్ ఒపీనియన్ కూడా తీసుకుంటారు. ఆర్బీఐ నిబంధనల మేరకు, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అనుమతులు ఉంటేనే లోన్లు ఇస్తారు' అని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. కస్టమర్ల కంటే ముందు డెవలపర్లు లోన్ తీసుకుంటారని, దీంతో ఆ ప్రాజెక్టుకు అనుమతులు దక్కినట్లుగా రికార్డులు ఉంటాయని పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాలైతే రూ.వందల కోట్ల రుణం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు. ప్రాపర్టీని మార్ట్ గేజ్ చేసుకున్న తర్వాతే లోన్ సాంక్షన్ అవుతుందని, లోన్ ఇచ్చేటప్పుడు డూస్, డోంట్ డూస్ అనే చార్ట్ ఉంటుందని, దాని ప్రకారమే ముందుకెళ్తామంటున్నారు. టైటిల్ ట్రాన్స్ ఫర్ అవుతుందంటేనే లీగల్ కదా.. అలాంటప్పుడు బ్యాంకుల తప్పు ఎలా అవుతుందని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ బీఎస్ రాంబాబు 'దిశ'తో అన్నారు.

### ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధి ఎలా తెలుస్తుంది?

ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లో నిర్మిస్తున్నారని తమకెలా తెలుస్తుందని బ్యాంకులు ప్రశ్నిస్తున్నాయి. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, రెరా వంటి సంస్థల అనుమతులు చూసిన తర్వాతే బ్యాంకులు రుణాలు ఇస్తాయి. బ్యాంకుల మధ్య నిబంధనల్లో కాస్త తేడాలు ఉండొచ్చు. ఏ బ్యాంకైనా అనుమతులు ఉన్నాయా? లేవా? అన్నదే ప్రధానంగా చూస్తుంది. ఉదాహరణకు మల్లంపేట విల్లాలకు ఎల్ఐసీ హౌజింగ్ లోన్స్ అప్రూవ్ చేసింది. కొన్ని బ్యాంకులేమో రిజెక్ట్ చేశాయి. ఒక్కో బ్యాంకుకు ఒక్కో వెసులుబాటు ఉంటుంది. అయితే అధికారులు జారీ చేసిన అనుమతులు చెల్లవని హైడ్రా చెబితే బాధ్యత ఎవరిదని బ్యాంకులు ప్రశ్నిస్తున్నాయి.

### రుణాల రికవరీ ఎలా?

లోన్లు తీసుకున్న ఏ క్లయింట్ కూడా తన ఇంటిని కూల్చేస్తే ఈఎంఐ కట్టే పరిస్థితి ఉండదు. బ్యాంకులు కూడా ఆక్షన్ పెట్టి సొమ్మును రికవరీ చేసే అవకాశముండదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నతాధికారుల సూచన మేరకు తాము పని చేయాల్సి ఉంటుందని, కోర్టుకు వెళ్లడం అనివార్యమని మేనేజర్ స్థాయి ఉద్యోగులు చెబుతున్నారు. అన్ని రకాల అనుమతులు ఉంటేనే లోన్లు తీసుకొని కొనుగోలు చేశామని, హైడ్రా కూల్చేస్తే తామేం చేయాలని కస్టమర్లు రిప్లయ్ ఇచ్చే అవకాశం ఉంది. దీంతో ఇక కోర్టు ఆదేశాలే కీలకంగా మారనున్నాయి. కస్టమర్ వాయిదాలు చెల్లించకపోతే ఏం చేయాలో తెలుసని, కానీ నిరాశ్రయుడైతే ఏ పద్ధతిని అనుసరించాలన్న గైడ్ లైన్స్ తమ దగ్గర లేవని ఓ బ్యాంక్ ఉద్యోగి జగన్ అభిప్రాయపడ్డారు.

### టైటిల్ ట్రాన్స్ ఫర్ అనేదే ప్రామాణికం - బీఎస్ రాంబాబు, కార్యదర్శి, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్

హోమ్ లోన్స్ జారీలో బ్యాంకుల తప్పు ఉండదు. అన్ని నిబంధనలు పాటిస్తారు. అన్ని రకాల అనుమతులు ఉన్నాయా? టైటిల్ ట్రాన్స్ ఫర్ అవుతుందా? పరిశీలించి, లీగల్ ఒపీనియన్ తీసుకొని బ్యాంకులు లోన్స్ ఇస్తాయి. అనుమతులు తీసుకున్న తర్వాతే డెవలపర్స్ కూడా పెద్ద మొత్తంలో రుణం తీసుకుంటారు. ఆ తర్వాత కస్టమర్లు కూడా పొందుతారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ ని గుర్తించే మెకానిజం, టెక్నికల్ నాలెడ్జ్ బ్యాంక్ ఎంపాయీస్ కి ఉండదు. అయితే ప్రభుత్వ ఇచ్చిన అనుమతులు ఇప్పుడు చెల్లవని అంటే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలే బాధ్యత వహించాలి. ఏయే బ్యాంకులు ఎంత వరకు లోన్లు ఇచ్చాయన్నది లెక్క తేలలేదు. ఇప్పుడు కోర్టుకు వెళ్లాల్సి వస్తుంది. ఎవరిది తప్పు? ఎవరు బాధ్యులు? అనేది కోర్టు తేలుస్తుంది.

### కస్టమర్ మీద ఒత్తిడి కుదరదు -డి.లోకేశ్, డిప్యూటీ మేనేజర్, హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్

ఏ ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్ అయినా అనుమతులు చూసిన తర్వాతే లోన్స్ ఇస్తాయి. కస్టమర్లు ఈఎంఐలు చెల్లించకపోతే ఎన్ పీఏలుగా మిగిలిపోతాయి. అయితే ఎగనిస్ట్ లోన్ మీద ఇన్సూరెన్స్ తీసుకొని ఉంటే రికవరీకి కొంత అవకాశం ఉంటుంది. అది కూడా సవాలక్ష ఆంక్షలతో కూడినదే. మొత్తం లోన్ రికవరీ కాకపోయినా 50 నుంచి 70 శాతం వరకు రావచ్చు. ఇల్లే లేనప్పుడు ఏ కస్టమర్ ఈఎంఐ కట్టడు. ఆక్షన్ వేయడానికి కూడా అక్కడ ప్రాపర్టే లేనప్పుడు ఇక ఎన్ పీఏగానే భావించాల్సి ఉంటుంది. అప్పటికే కస్టమర్ తన సొంత డబ్బు కూడా లాస్ అయి ఉంటాడు. ఇక బ్యాంకు లోన్ మీద ఒత్తిడి సాధ్యం కాదు. లీగల్ గా ప్రొసీడ్ కావడం తప్ప మరో మార్గమేదీ ఉండదు.

శాసనసభ
తెలుగు దినపత్రిక

గురువారం 26 సెప్టెంబర్ - 2024

# పార్టీలోకి వచ్చిన నాలుగేళ్లలో సీఎం కావడం చరిత్రలో లేదు...
## కానీ రేవంత్ రెడ్డి అయ్యారు: వీహెచ్



**శాసనసభ /హైదరాబాద్ :** పార్టీలోకి వచ్చిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి కావడం ఇక్కడి చరిత్రలో లేదని, కానీ రేవంత్ రెడ్డి అయ్యారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. హెూటల్ హరిత ప్లాజాలో కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా సమగ్ర కులగణన, బీసీ రిజర్వేషన్ పెంపుపై రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ... బీసీ నేతను పీసీసీ చీఫ్‌గా చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారన్నారు. తన రాజకీయ జీవితంలో బీసీల గురించి రాహుల్ గాంధీ మాట్లాడినట్లు ఎవరూ మాట్లాడలేదన్నారు.జనాభా ప్రాతిపదికన ఎవరి హక్కులు వారికే దక్కాలని రాహుల్ గాంధీ చెప్పారని పేర్కొన్నారు. కులగణన చేయాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని బీజేపీని కోరినప్పటికీ పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణలోని ఆరు డిక్లరేషన్లతో పాటు బీసీ కులగణన చేపడతామని పార్టీ చెప్పిందన్నారు. బీసీ డిక్లరేషన్ అనగానే గత ఎన్నికల్లో కులాలకు అతీతంగా ఓటు వేశారన్నారు.కులగణన చేయాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిపై ఉందన్నారు. రేవంత్ రెడ్డి పక్కన చెప్పేవారు ఎక్కువ అయ్యారని పేర్కొన్నారు. అసెంబ్లీలో బీసీ కులగణన బిల్లు పాస్ అయిందని, త్వరలో మనకు న్యాయం జరుగుతుంది అంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ త్వరగా బీసీ కులగణన చేస్తేనే రాహుల్ గాంధీ ఎక్కడైనా మాట్లాడగలుగుతారన్నారు. లేదంటే మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కులగణన చేయాలని ఇతర పార్టీలు సూచిస్తాయన్నారు.

# గాంధీ భవన్‌లో మొదటి రోజు ముగిసిన ముఖాముఖి



**శాసనసభ /హైదరాబాద్ :** గాంధీ భవన్‌లో మొదటి రోజు ముఖాముఖి కార్యక్రమంలో ముగిసింది. ఈ సందర్భంగా 285కు పైగా అప్లికేషన్లు మంత్రి దామోదర రాజనర్సింహ స్వీకరించారు. హెల్త్ ఇష్యూస్, 317 బాధితులు, భూ వివాదం, అక్రమ కేసులు, బదిలీలు అంటూ ఫిర్యాదు అందాయి.బీఆర్ఎస్ హయంలో రౌడీ షీట్ పెట్టారంటూ మంత్రి ముఖాముఖిలో సిరిసిల్లకు చెందిన యువకుడు ఫిర్యాదు చేశాడు. కేటీఆర్ తనపై తప్పులు కేసులు నమోదు చేశాడని ఫిర్యాదు చేశాడు సదరు యువకుడు. 30 ఫిర్యాదులను అప్పటికప్పుడు అధికారులకు ఫోన్ చేసి మంత్రి దామోదర రాజనర్సింహ పరిష్కారం చేశారు. గాంధీ, ఉస్మానియా, పోలీస్ స్టేషన్లకు చెందిన అర్జీలపై మంత్రి ఫోన్ చేశారు. 3.30 గంటల వరకు నిర్విరామంగా మంత్రి ముఖాముఖి కొనసాగింది.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. పార్టీకి ప్రభుత్వానికి ఈ కార్యక్రమం ద్వారా మంచి జరుగుతుందని, పార్టీ కార్యకర్తలు,ప్రజలు అనే తేడా లేకుండా అందరి అర్జీలు తీసుకొని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఓవర్ నైట్‌లో సమస్యలు పరిష్కారం అవుతాయని మేము అనుకోవడం లేదని, ఒక్కొక్కటి చేస్తే అన్ని పరిష్కారం అవుతాయన్నారు. గతంలో సమస్యలు వినేవారే లేరని, కానీ ఇప్పుడు మేము చాలా సమయం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో పాల్గొని ప్రజల సమస్యలు విని,పరిష్కరించే దిశగా అడుగులు వేయడం చాలా సంతోషంగా ఉందని, అర్జీలను సంబంధిత శాఖలకు పంపడం జరుగుతుందన్నారు మంత్రి దామోదర. కొన్ని సమస్యలను ఇక్కడే పరిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు.

# బిల్లుల కోసం అప్పులా..?



**హైదరాబాద్ / శాసనసభ :** ''కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌ను.. కేవలం రుణాలు తీసుకొని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికే ఏర్పాటు చేశారా? కార్పొరేషన్‌కు ఆస్తులున్నాయా? ఆదాయం ఏమైనా ఉందా? దీని నిర్వహణకు నిధులెక్కడివి? కాగ్ నివేదిక ఆమోదయోగ్యమైనదేనా?'' అంటూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌తో ముడిపడిన అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించింది. బుధవారం కాళేశ్వరం ప్రాజెక్టులోని ఆర్థిక అంశాలపై ముగ్గురు అధికారులను కమిషన్ విచారించింది. కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ నుంచి రుణాలు తీసుకోవాలని ఆదేశించిందెవరు? అని కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (సీఏవో)గా పనిచేసిన కొమ్రరాజు వెంకట అప్పారావును కమిషన్ ప్రశ్నించగా.. తాను విధుల్లో చేరిన సమయంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న రజత్‌కుమార్ ఆదేశాలతో కార్పొరేషన్ రుణాలు తీసుకుందని చెప్పారు. ప్రభుత్వం పూచీకత్తు ఇస్తే.. కాళేశ్వరం కార్పొరేషన్ పాలకమండలి సమావేశంలో చర్చించి, ఎండీ అనుమతితో రుణాలు తీసుకున్నామని వివరించారు. రుణాల సమీకరణలో తన పాత్రేమీ లేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో పూర్తయిన పనులను కార్పొరేషన్ ఆస్తులుగా పరిగణిస్తామని, కార్పొరేషన్‌కు స్వతహాగా ఎలాంటి ఆదాయం లేదని పేర్కొన్నారు. 2023 నుంచి రామగుండం ఫర్టిలైజర్, ఎన్‌టీపీసీ నుంచి నీటి విడుదలకు సంబంధించిన నిధులు వస్తున్నాయని తెలిపారు.దీంతో ఎస్ఈ 2021 జనవరి 1న మరో మెమో జారీచేశారు. ''మరొకసారి కోరుతున్నా.. నిర్మాణ ఒప్పందంలోని క్లాజ్-45 ప్రకారం బ్యాంకు గ్యారంటీని విడుదల చేసి, రిపోర్టు చేయాలి'' అని ఆయన అందులో పేర్కొన్నారు. దీంతో బ్యాంకు గ్యారంటీలు విడుదలకు ఈఈ తిరుపతిరావు నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లుతో పాటు అప్పటి రామగుండం ఎస్ఈ-1లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు కూడా చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల టెండర్లు, నిర్మాణం అన్ని వ్యవహారాల్లో వీరిద్దరి పాత్ర ఉన్నట్లు ఆధారాలు ఉండగా.. ప్రభుత్వం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లును ఉద్వాసన పలికి, అప్పటి ఎస్ఈని కీలక బాధ్యతల్లో కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది.

# పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తాం



**శాసనసభ / కల్వకుర్తి :** పాలమూరు రంగారెడ్డ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇవాళ ఆయన నాగర్ కర్నూల్ జిల్లాలో మాట్లాడుతూ..వచ్చే ఆరు నెలల్లోపు ఉదండాపూర్, బీమా, నెట్టెంపాడు, పాలమూరు రంగారెడ్డి భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం చెల్లిస్తామని ఆయన తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో గత ప్రభుత్వం 22,500 కోట్లు ఖర్చుపెట్టి ఒక్క ఎకరా ఆయకట్టుకు కూడా నీరందించలేదని, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ వంటి పెండ్లి ప్రాజెక్టులను 10 ఏళ్లలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేదన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. నీటిపారుదల శాఖను గత ప్రభుత్వం అన్ని విధాల నిర్వీర్యం చేసిందని, 1.8 లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రం ఆయకట్టును స్థిరీకరించింది గత ప్రభుత్వమని ఆయన మండిపడ్డారు. ఎక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును స్థిరీకరించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు మీరు అందించి సస్యశ్యామలం చేస్తామని ఆయన అన్నారు.

# నేడు ఢిల్లీకి మంత్రి సీతక్క



**శాసనసభ /హైదరాబాద్ :** నేడు ఢిల్లీకి మంత్రి సీతక్క వెళ్లనున్నున్నారు. పెసా చట్టంపై జరిగే జాతీయ సదస్సుల్లో మంత్రి సీతక్క పాల్గొననున్నారు. పెసా చట్టంపై గురువారం నాడు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరుగనుంది.న్యూ ఢిల్లీలోని డా. అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ లో పెసా చట్టం అమలు, ఎదురవుతున్న సవాళ్లపై చర్చ నిర్వహించనున్నారు. కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొనున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరుపున సదస్సుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క హాజరవుతున్నారు. ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి, పెసా చట్ట అమల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, పరిష్కార మార్గాలపై ప్రసంగించనున్నారు మంత్రి సీతక్క. పంచాయతీల నిబంధనల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం, 1996 PESA చట్టంగా సంక్షిప్తీకరించబడింది. భారతదేశంలోని షెడ్యూల్డ్ ప్రాంతాలలో నివసించే ప్రజల కోసం సాంప్రదాయ గ్రామసభల ద్వారా స్వయం పాలనను నిర్ధారించడానికి భారత ప్రభుత్వం రూపొందించిన చట్టం . షెడ్యూల్డ్ ప్రాంతాలు భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ద్వారా గుర్తించబడిన ప్రాంతాలు. షెడ్యూల్డ్ ప్రాంతాలు భారతదేశంలోని పది రాష్ట్రాల్లో గిరిజన సంఘాలు అధికంగా ఉన్నాయి.

# దేశంలో కులాలు ఉన్నంత వరకు
## రిజర్వేషన్స్ ఉంటాయని ఖర్గే చెప్పారు..



**శాసనసభ /హైదరాబాద్ :** హెూటల్ హరిత ప్లాజాలో కామారెడ్డి డిక్లరేషన్ కు అనుగుణంగా సమగ్ర కులగణన బీసీ రిజర్వేషన్స్ పెంపుపై రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్..మాజీ ఎంపీ వీహెచ్.. బీసీ సంఘాల నేతలు.. ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో కులాలు ఉన్నంత వరకు రిజర్వేషన్స్ ఉంటాయని ఖర్గే చెప్పారన్నారు. ధైర్యంగా బీసీల కులగణన గురించి మాట్లాడుతున్న ఛాంపియన్ రాహుల్ గాంధీ అని, ఎవరికి దక్కాల్సిన వాటా వారికి దక్కాలనే కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ఇచ్చామన్నారు మహేష్ కుమార్ గౌడ్. డిక్లరేషన్ ను ప్రవేశ పెట్టే బాధ్యత కూడా రేవంత్ రెడ్డి నాకే ఇచ్చారని, డిక్లరేషన్ కు ముందు కొన్ని మార్పుల కోసం కూర్చుంటే మీరు చేయండి నేను ఉన్నాను అని రేవంత్ చెప్పారన్నారు. కాళేశ్వరం ఒక పనికిరాని ప్రాజెక్ట్.. రాష్ట్రం అప్పుల్లో ఉందని, ఎంత ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం కమిట్మెంట్ తో పని చేస్తుందన్నారు మహేష్ గౌడ్.అంతేకాకుండా..'కులగణన జరగనది రాష్ట్రంలో ఎన్నికలు అసలు జరగవు.. అసెంబ్లీలో బిల్లు కూడా పెట్టాం.. మరో నాలుగైదు రోజుల్లో కులగణనకు సంబంధించిన విధివిధానాలు రావొచ్చు.. కులగణనపై ఎటువంటి అపోహలు వద్దు.. పీసీసీగా చెప్తున్నా.. కులగణన చేయకపోతే నేను ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రేవంత్ కు చెప్పాను.. కులగణనపై రేవంత్ ఒప్పుకున్నారు.. ముందుకు వెళ్దాం అని సీఎం అన్నారు.. కులగణన మాట తీయగానే BRS వాళ్లు విమర్శలు చేస్తున్నారు.. ఇంపోర్టెడ్ కార్ లలో ఎవరు తిరుగుతున్నారో చూస్తున్నాం.. అందుకే వాళ్లని ఇంటికి పంపించారు.. %=ూా% చీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్స్ తీసేస్తాం అని చెప్పారు.. ఇప్పుడు బీజేపీ మాట మార్చింది.. రాహుల్ గాంధీని చూసి బీజేపీ భయపడుతుంది.. అందుకే రిజర్వేషన్స్ పై మాట మార్చారు బిజెపి నాయకులు.. బీజేపీ కులగణన వ్యతిరేకిస్తుంది.. బీసీ ప్రధానిగా ఉన్నాడు అని బిజెపి చెప్తుంది.. ఏ బీసీకి న్యాయం జరిగింది.! అంబానీ.. అదానీ ఆస్తులు ఎలా పెరిగాయి.! వీరు ఏ వర్గం వాళ్లు.! ఎవరి అండతో వీళ్లు సంపాదిస్తున్నారు.! %దీ=ూా% తమ పార్టీ అధ్యక్షుడ్ని మార్చగలదా.! బీసీని అధ్యక్షుడుని చేయగలదా.. నాలుగు యూనివర్సిటీల వీసీలు బీసీలకు ఇవ్వాలని కోరాను.. సీఎం ఒప్పుకున్నారు.. సీఎం రేవంత్ కు నాకు ఉన్న సఖ్యత వల్ల పార్టీ పాలన రెండు సాఫీగా సాగుతాయి.. బీసీల కులగణన కాంగ్రెస్ పార్టీ పేటెంట్ రైట్.. రాహుల్ గాంధీ మది నుంచి వచ్చిన ఆలోచన.. నేను.. సీఎం ఎవరైనా రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే నడుచుకుంటాం.. కులాభిమానం ఉండాలి కానీ కుల పిచ్చి ఉండొద్దు.. అన్ని కులాలు ఒకటిగా ఉండాలి.. రాష్ట్ర ముఖ్యమంత్రికి నిర్దిష్టమైన ఆలోచన ఉంది.. దానికి అనుగుణంగా అడుగులు పడుతున్నాయి..' అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

# తమ్మడపల్లిలో బెల్టు షాపుల నిర్మూల కమిటీ ఏర్పాటు

**- మిషన్ పరివర్తన్ దేశానికే ఆదర్శం కావాలి.**

**-మర్రిగూడ మండల అధ్యక్షులు రామదాసు శ్రీనివాస్**




**మర్రిగూడ, సెప్టెంబర్ 25 శాసనసభ న్యూస్ ప్రతినిధి**

మర్రిగూడ మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు తమ్మడపల్లి గ్రామంలో బెల్ట్ షాపుల నిర్మూలన కమిటీ వేసి గ్రామంలో "మిషన్ పరివర్తన్" ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి బెల్ట్ షాపులు అరికట్టాలని ఒక్క బెల్టు షాపు కూడా నిర్వహించకూడదని బుధవారం నుంచి ఏ ఒక్కరు మందు గాని, గుడంబాగానీ అమ్మితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఈ కమిటీ ద్వారా మర్రిగూడ మండల ఎస్ఐ రంగారెడ్డి కఠినచర్యలు తప్పని తెలియజేశారు. ఈ కమిటీ సభ్యులుగా గ్రామ నాయకులు ఎన్నుకోబడ్డారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షులు రామదాసు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొట్టం రమేష్,గ్రామ శాఖ అధ్యక్షులు ఇదగోని వెంకటేష్, కొట్టం శీను, రమేష్,జంగయ్య, ఎండి నజీర్ డి. సతీష్, యాదయ్య, మహిళలు ఆయిలి ఉషమ్మ, అండాలు, నిర్మలమ్మ, నాగమణి, ఎండి మిశ్రీన్, సిపిఐ సభ్యులు పాండురంగారావు, మాజీ ఎంపీటీసీ యాదయ్య, బాలకిషన్, ఎం. నరసింహ్మ, గ్రామ పెద్దలు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలి
## బీసీ కులగణన వేగంగా పూర్తి చేయాలి

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. బీసీ కులగణన ప్రక్రియపై సమగ్ర అధ్యయనం అవసరమని ఈ సందర్భంగా సీఎం అన్నారు. పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని బీసీ కమిషన్‌ను ఆదేశించారు. బీసీ కులగణను ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలన్నారు.అవసరమైతే ఇతర రాష్ట్రాలకు వెళ్లి విధివిధానాలను పరిశీలించాలని సూచించారు. బీసీ కులగణనను త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. రాష్ట్రంలో బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధివిధానాలపై సీఎంతో కమిషన్ సభ్యులు చర్చించారు.

# ఢిల్లీ లిక్కర్ కేసు..
## కోర్టు విచారణకు హాజరైన కవిత

ఢిల్లీ లిక్కర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఈరోజు కోర్టు విచారణకు హాజరయ్యారు. లిక్కర్ కేసులో సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్ షీట్ పై ఈరోజు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరిపింది. ఈ విచారణకు కవితతో పాటు ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాతో పాటు ఇతర నిందితులు కూడా హాజరయ్యారు. కవిత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్ గా విచారణకు హాజరయ్యారు. ప్రతివాదులకు సీబీఐ అందజేసిన ప్రతులు సరిగా లేవని విచారణ సందర్భంగా కోర్టుకు న్యాయవాదులు తెలిపారు. దీంతో, సరైన ప్రతులను ప్రతివాదులకు అందజేయాలని సీబీఐని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 4వ తేదీకి వాయిదా వేసింది. లిక్కర్ కేసులో కవిత ప్రస్తుతం బెయిల్ పై ఉన్న సంగతి తెలిసిందే. ఆగస్ట్ 27వ తేదీన కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

# ముందంజలో దూసుకెళ్తోన్న కమలాహారిస్..
## తాజా సర్వేలో ఎన్ని ఓట్లు వచ్చాయంటే..!

అయితే తాజాగా జరిగిన సర్వేలో ట్రంప్‌ను కమల వెనక్కి నెట్టినట్లు రాయిటర్స్-ఇప్సోస్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 3 రోజుల పాటు నిర్వహించిన సర్వే సెప్టెంబర్23తో ముగిసింది. ఈ సర్వేలో ట్రంప్‌నకు 40.48శాతం అనుకూలంగా ఓట్లు రాగా.. కమలకు 46.61 శాతం అనుకూల ఓట్లు వచ్చాయి. సెప్టెంబర్ తొలి వారంలో నిర్వహించిన సర్వేతో పోలిస్తే కమల ఒక శాతం ఎక్కువ ఓట్లు సాధించింది. నవంబర్5న అమెరికా అధ్యక్ష ఎన్నికల తుదిపోరు జరగనుంది.తొలుత ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ రంగంలోకి దిగారు. అయితే ఆరోగ్య రీత్యా దేహం సహకరించకపోవడంతో ఆయన స్థానంలో కమలా హారిస్‌ను డెమోక్రాట్ పార్టీ రంగంలోకి దింపింది. ఈమెతో మాజీ అధ్యక్షుడు ట్రంప్ పోటీ పడుతున్నారు. ఇదిలా ఉంటే ఈసారి ఓడిపోతే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయనని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటీవల ట్రంప్ హత్యాయత్నం జరిగింది. దీంతో ఆయనపై సానుభూతి పెరిగింది. ఇద్దరిలో ఎవరు గెలుస్తారో మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.

# రేవంత్ అనాడు మాట్లాడిన ఒక్క మాట కూడా అమలు చేయలేదు



**శాసనసభ /హైదరాబాద్ :** తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ..సర్పంచులు, గ్రామ పంచాయతీలను కేసీఆర్ ప్రభుత్వం విస్మరిస్తుందని రేవంత్ రెడ్డీ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మాట్లాడారు.. బిల్లులు రాక 60 మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని అప్పుడు రేవంత్ అన్నారు.. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేవంత్ అనాడు మాట్లాడిన ఒక్క మాట కూడా అమలు చేయలేదు అని ఆయన మండిపడ్డారు. సర్పంచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు ఆయనని పలకరించిన నాథుడే లేడు.. అడ్డదారులు తొక్కి అధికారంలోకి రేవంత్ రెడ్డి వచ్చారు.. సర్పంచుల పెండింగ్ బిల్స్ వెంటనే చెల్లించాలి అని డిమాండ్ చేశారు. దసరాలోపు పెండింగ్ బిల్స్ క్లియర్ చేయాలని ఈటల రాజేందర్ అన్నారు.లేకుంటే మిమ్మల్ని ఎక్కడికి అక్కడ అడ్డుకునేందుకు సర్పంచులు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. సర్పంచుల ఆందోళనకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తాం.. సర్పంచ్ ల పదవి కాలం పూర్తయ్యి ఏడు నెలలు దాటినా ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదు అని ప్రశ్నించారు. పాలక మండలి లేక గ్రామాల్లో చెత్త పేరుకుపోతుంది.. రేవంత్ గ్రామాలను వల్లకాడుగా మార్చారు.. వెంటనే రిజర్వేషన్లు ప్రకటించి సర్పంచు ఎన్నికలు జరపాలి అని కోరారు.

# ఆర్.కృష్ణయ్యతో కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి భేటీ..



**శాసనసభ /హైదరాబాద్ :** రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యతో నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి సమావేశం అయ్యారు.విద్యా నగర్‌లోని కృష్ణయ్య నివాసానికి వెళ్లిన ఎంపీ రవి, కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానించినట్లు బీసీ సంక్షేమ సంఘం నాయకులు చెప్పుకొచ్చారు. బీసీ సంక్షేమ సంఘం కమిటీ, తన అనుచరులతో కలిసి చర్చించిన తర్వాత తుది నిర్ణయం తెలియజేస్తానని కృష్ణయ్య చెప్పినట్లు తెలుస్తుంది. కాగా, ఇవాళ ఉదయం 11 గంటలకు ఆర్. కృష్ణయ్య మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మీడియా సమావేశంలో కృష్ణయ్య ఏ ప్రకటన చేస్తారోనన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో కొనసాగుతుంది.అయితే, జాతీయ స్థాయిలో బీసీ కుల గణన ఉద్యమాన్ని బలోపేతం చేయడానికే తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, రాజ్యసభ పదవికి రాజీనామా చేసినట్ల నిర్ణయం తీసుకున్నట్లు ఆర్. కృష్ణయ్య చెప్పారు. బీసీ ఉద్యమం గ్రామస్థాయికి చేరిందని.. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పెంపును సాధించడానికి ఆందోళలను ఉధృతం చేస్తామన్నారు. కాగా, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ బీసీ సీఎం వాదాన్ని ముందుకు తీసుకొచ్చింది. తాము అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పుకొచ్చింది. ఇక, ఆర్ కృష్ణయ్య రాజీనామా చేయగానే భారతీయ జనతా పార్టీలో చేరాలని కోరింది. జాతీయ స్థాయిలో కీలక పదవి కూడా ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం




# కపిల్ షోలో దేవర టీమ్ సందడి

ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో సీజన్ 2 గ్లిట్జీ స్పిన్ కోసం సిద్ధంగా ఉంది. శనివారం (సెప్టెంబర్ 28), కపిల్ శర్మ హోస్ట్ చేసిన కామెడీ ప్రోగ్రామ్ దేవర: పార్ట్ 1 ం జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ మరియు సైఫ్ అలీ ఖాన్ తారాగణాన్ని స్వాగతించనుంది.నెట్‌ఫ్లిక్స్‌లో ప్రీమియర్‌కు ముందు, ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో మేకర్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో సరదా ప్రోమోను వదులుకున్నారు. “ఉత్తరం మరియు దక్షిణం కలిసినప్పుడు, అది వినోదాన్ని రెట్టింపు చేస్తుంది,” వీడియోలోని వచనాన్ని చదవండి. వేదికపై నృత్యం చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న దేవర తారాగణం గాడిలో పడింది. ఒక సెగ్మెంట్‌లో జూనియర్ ఎన్టీఆర్ సరదాగా కపిల్ శర్మతో ఇలా అన్నాడు, “నన్ను కూర్చోమని అడుగుతావా అని నేను గత ఐదు నిమిషాలుగా ఆలోచిస్తున్నాను”. హాస్యనటుడు-నటుడు ఇబ్బందికరమైన చిరునవ్వుతో, ‘ఓహ్, ఎందుకు కాదు? దయచేసి రండి.”

# ‘సరిపోదా శనివారం’ డిజిటల్ ఎంట్రీ




వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో నేచురల్ స్టార్ నాని నటించిన ‘సరిపోద శనివారం’ చిత్రం ఆగస్ట్ 29, 2024న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ అయ్యింది. ఈ మాస్ మసాలా ఎంటర్‌టైనర్ విమర్శకులు మరియు ప్రేక్షకుల నుండి సానుకూల సమీక్షలను అందుకుంది.ఈ సినిమా యొక్క డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్ ని నెట్ఫ్లిక్ సొంతం చేసుకుంది. తాజాగా డిజిటల్ ప్లాట్ఫారం ఈ సినిమా రేపు అంటే సెప్టెంబర్ 26న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీలో స్ట్రీమింగ్ కి అందుబాటులోకి రానున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేసేందుకు స్ట్రీమింగ్ ప్లాట్ఫారం సోషల్ మెడిలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసింది. ఈ చిత్రంలో సాయికుమార్, అభిరామి, మురళి శర్మ, అజయ్, హర్షవర్ధన్, సుధాకర్, సుప్రీత్ రెడ్డి, అదితి బాలన్ కీలక పాత్రలలో నటిస్తున్నారు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్‌పై డివివి దానయ్య ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ యాక్షన్ డ్రామాకు జేక్ బెజోయ్ సంగీతం అందిస్తున్నారు.



# కోర్టుకెక్కిన రకుల్ ప్రీత్ సింగ్ భర్త!
## ఆ సినిమా బడ్జెట్ విషయంలో భారీ తప్పులు...

రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీ, బాలీవుడ్ డైరెక్టర్ ఆలీ అబ్బాస్ జాఫర్‌పై కేసు వేశాడు.. ‘బడే మియాన్ చోటే మియాన్’ సినిమాకి నిర్మాతగా వ్యవహరించారు జాకీ భగ్నానీ, ఆయన తండ్రి వసు భగ్నానీ...ఆలీ అబ్బాస్ జాఫర్ డైరెక్షన్‌లో తెరకెక్కిన ‘బడే మియాన్ చోటే మియాన్’ మూవీ రూ.350 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కింది. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, పృథ్వీరాజ్ సుకుమారన్ ముఖ్యపాత్రల్లో నటించిన ‘బడే మియాన్ చోటే మియాన్’ సినిమా, మొత్తంగా రూ.100 కోట్లు కూడా వెనక్కి రాబట్టలేకపోయింది...అయితే ఈ సినిమా కోసం పెట్టిన మొత్తంలో చాలా వరకూ డైరెక్టర్ ఆలీ అబ్బాస్ జాఫర్, సొంత ఖర్చుల కోసం వాడుకున్నాడని పోలీసులకు ఫర్యాదు చేశాడు జాకీ భగ్నానీ.. దీంతో లీగల్ కేసు నమోదు చేన పోలీసులు, డైరెక్టర్ ఆలీ అబ్బాస్‌కి సమన్లు పంపించారు..సోనాక్షి సిన్హా, మనుషి చిల్లర్ హీరోయిన్లుగా నటించిన ‘చోటే మియాన్ బడే మియాన్’ మూవీకి ఆలీ అబ్బాస్ జాఫర్ కూడా సహ-నిర్మాత.. ‘మేరే బ్రదర్ కి దుల్హన్’ సినిమాతో దర్శకుడిగా మారిన ఆలీ అబ్బాస్ జాఫర్, ‘గుండే’, ‘సుల్తాన్’, ‘టైగర్ జిందా హై’, ‘భారత్’, ‘జోగి’, ‘బ్లడీ డాడీ’ వంటి సినిమాలకు దర్శకత్వం వహించాడు...జాకీ భగ్నానీ, నిర్మాతగా వచ్చిన గత మూడు సినిమాలు ‘మిషన్ రాణిగంజ్’, ‘గణపత్’, ‘బడే మియాన్ చోటే మియాన్’ భారీ నష్టాలను తెచ్చిపెట్టాయి. 2021 నుంచి హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్‌తో రిలేషన్‌లో ఉన్న జాకీ భగ్నానీ.. 2024, ఫిబ్రవరి 21న ఆమెని పెళ్లి చేసుకున్నాడు..

# దయచేసి ఆ వీడియోని ఇప్పుడు వాడకండి

ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ వ్యవహారం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఎక్కడా చూసినా దాని గురించే మాట్లాడుకుంటున్నారు. ఇక సోషల్ మీడియాలో అయితే గత వారం నుంచి జానీ మాస్టర్ మ్యాటరే నడుస్తోంది.ఈ నేపథ్యంలో తాజాగా యాంకర్ రష్మి ఇంటర్వ్యూకి సంబంధించిన వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. అయితే అది పాత వీడియో. గతంలో రష్మి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూని ప్రస్తుతం జానీ మాస్టర్ వ్యవహారంతో ముడిపెడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అది కాస్త వైరల్ కావడంతో చివరకు రష్మి ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఆ ఇంటర్వ్యూని ఇప్పుడు వాడొద్దని విజ్ఞప్తి చేసింది.’మైనర్‌పై లైంగిక వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్‌కు చాలా వ్యత్యాసం ఉంది. క్యాస్టింగ్ కౌచ్ అనేది ఇద్దరి వ్యక్తుల వ్యక్తిగత సమ్మతికి సంబంధించిన విషయం. నేను ఇచ్చిన ఈ ఇంటర్వ్యూ(ప్రస్తుతం వైరల్ అవుతున్న వీడియోను ఉద్దేశించి) చాలా పాతది. 2020 కంటే ముందే నేను ఆ ఇంటర్వ్యూ ఇచ్చాను. ఇప్పుడు ఆ వీడియోని వైరల్ చేస్తూ జనాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. దయచేసి ఆ వీడియోని వాడకండి. పని ప్రదేశాలు మహిళలకు సురక్షితంగా ఉండాలి. ఏదైనా విషయంలో ఒక మహిళ నో అని చెబితే ఆమె అభిప్రాయాన్ని గౌరవించాలి’అని రష్మి ట్వీట్ చేసింది. ఆ వీడియోలో ఏముందంటే..రష్మి గతంలో ఓ ఇంటర్వ్యూలో క్యాస్టింగ్‌కౌచ్ గురించి మాట్లాడుతూ.. ‘ఇండస్ట్రీలోనే కాదు అన్ని పరిశ్రమల్లోనూ మహిళలకు వేధింపులు ఎదురవుతున్నాయి. ఇలాంటివి ఎదురైనప్పుడు ‘నో’ చెప్పడం అమ్మాయిలు నేర్చుకోవాలి. నీకు చేయాలని లేకపోతే చేయలేనని చెప్పాలి. కొంతమంది అమ్మాయిలు త్వరగా ఉన్నత శిఖరాలకు వెళ్లాలని అలాంటివాటికి ఓకే చెబుతారేమో. ఎవరూ ఎవరిని బలవంతం చేయరు. దాన్ని రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదు. అత్యాచారానికి పాల్పడితే అది తప్పు’ అని రష్మిక అన్నారు. ఈ వీడియోని ఇప్పుడు షేర్ చేస్తూ.. జానీ మాస్టర్ వివాదంపై రష్మిక ఇలా స్పందించింది అంటూ వైరల్ చేస్తున్నారు.

# ‘కల్కి’కి అరుదైన అవకాశం..
## అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రభాస్ మూవీ



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రం ‘కల్కి 2898 ఏడీ’ బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.ఈ చిత్రానికి మరో అరుదైన అవకాశం దక్కింది. 29వ బుసాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు ఎంపికైంది.గత జూన్‌లో విడుదలైన ఈ సినిమా.. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది. మహాభారత కాలాన్ని.. భవిష్యత్తును మేళవించి తెరకెక్కించిన ఈ సినిమా రూ.1,200 కోట్లకు పైగా వసూలు చేసింది. ఎపిక్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ మూవీగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘కల్కి’ ఓపెన్ సినిమా విభాగంలో ఈ ఫెస్టివల్‌కు ఎంపికైంది. ఈ ఏడాది 29వ బుసాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అక్టోబరు 2 నుంచి 11 వరకు జరగనుంది. బీఐఎఫ్ఎఫ్‌లోని అతిపెద్ద బహిరంగ థియేటర్‌లో కల్కిని అక్టోబరు 8, 9 తేదీల్లో ప్రదర్శించనున్నారు.కాగా.. భారీ అంచనాల నడుమ జూన్ 27న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లింది. అగ్ర నటులు అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, కమల్ హాసన్.. సుప్రీం యాస్కిన్‌గా ఆకట్టుకున్నారు. ప్రస్తుతం నాగ్ అశ్విన్, ఆయన టీమ్ పార్ట్-2 స్క్రిప్ట్‌ను పూర్తి చేసేపనిలో ఉంది.

# నటుడు మోహన్ బాబు ఇంట్లో దొంగతనం..
## భారీగా నగదు చోరీ..



సీనియర్ నటుడు , కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంట్లో పని చేస్తున్న వ్యక్తే దొంగతనం చేశాడని తెలుస్తోంది. హైదరాబాద్ శివారులోని జల్ పల్లిలో ఉన్న మోహన్ బాబు ఇంట్లో దొంగతనం జరిగిందని తెలుస్తోంది.ఆయన ఇంట్లో పని చేస్తున్న నాయక్ అనే వ్యక్తి డబ్బును దొంగిలించాడు. రూ. 10 లక్షల రూపాయిల డబ్బును దొంగలించి పారిపోయాడని తెలుస్తోంది. కాగా దొంగతనం జరగడంతో మోహన్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు.నిన్న రాత్రి( మంగళవారం) రాచకొండ సీపీకి మోహన్ బాబు ఫిర్యాదు చేసారు. దీంతో ఈ కేసులో వెంటనే స్పందించి దర్యాప్తు చేశారు. కాగా తిరుపతిలో ఇవాళ ఉదయం మోహన్ బాబు ఇంటి పనిమనిషి(ఎవరైతే దొంగతనం చేశాడో) నాయక్ ను పట్టుకున్నారు రాచకొండ పోలీసులు. ప్రస్తుతం అతన్ని హైదరాబాద్ కి తరలిస్తున్నారు.ఇక మోహన్ బాబు ప్రస్తుతం కన్నప్ప లో నటిస్తున్నారు. అలాగే ఈ ను నిర్మిస్తున్నారు కూడా.. ఈ లో మంచు విష్ణు హీరోగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కంటెంట్ తో తెరకెక్కుతోన్న ఈ లో చాలా మంది స్టార్స్ నటిస్తున్నారు. బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్‌తో పాటు టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ కూడా అతిథి పాత్రలో కనిపించనున్నాడు.



# రెండో టెస్ట్ రద్దు..?



బంగ్లాదేశ్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా.. మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి కాన్పూర్ వేదికగా ప్రారంభం కానున్న రెండో టెస్ట్‌లో పర్యాటక బంగ్లాదేశ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో 280 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన టీమిండియా.. రెండో టెస్ట్‌లోనూ బంగ్లాదేశ్‌ను ఓడించాలనుకుంటుంది.తద్వారా సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేయడంతో పాటు డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలనుకుంటోంది. ఇప్పటికే కాన్పూర్ చేరిన టీమిండియా నెట్స్‌లో గంటల కొద్దీ శ్రమిస్తోంది. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఈ మ్యాచ్ తొలి మూడు రోజులు వర్షం అంతరాయం కలిగిస్తోందని వాతావరణ శాఖ పేర్కొంది.గత మూడు రోజులుగా కాన్పూర్ నగరం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతోంది. వర్షమే ఆ నగర ప్రజలకు కాస్త రిలీఫ్ ఇవ్వనుంది. వర్షం కురిస్తే రెండో టెస్ట్‌కు అంతరాయం కలగనుంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. మ్యాచ్ ప్రారంభమయ్యే శుక్రవారం రోజు అయితే 93 శాతం వర్షం వచ్చే ఛాన్స్ ఉంది. గరిష్ట ఉష్ణోగ్రత 31 డిగ్రీల సెల్సియస్‌గా ఉండనుంది.శనివారం అయిన రెండో రోజు 83 శాతం వర్షం వచ్చే అవకాశం ఉంది. సాయంత్ర వేళలో భారీ ఉరుములతో వర్షం వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మూడో రోజు అయిన ఆదివారం మాత్రం 59 శాతం వర్షం పడే ఛాన్స్ ఉంది. ఆకాశాన్ని మబ్బులు కమ్మేయనున్నాయి. నాలుగు, ఐదో రోజు మాత్రం వర్ష సూచన లేదు.తొలి మూడు రోజులు వర్షం కురిసినా.. కాస్త ఆట సాధ్యమైతే చివరి రెండు రోజుల ఆటతో ఫలితం తేలనుంది. అయితే భారీ వర్షం కురిస్తే మైదానం చిత్తడిగా మారి ఆటకు ఆటంకం కలిగే ప్రమాదం ఉంది. ఈ వర్ష సూచన భారత అభిమానులను కలవరపెడుతోంది. వర్షం కారణంగా ఈ మ్యాచ్ రద్దయినా.. డ్రాగా ముగిసినా సిరీస్ భారత్ కైవసం అవుతుంది. కానీ డబ్ల్యూటీసీ ఛాంపియన్‌షిప్ 2025 పాయింట్స్ టేబుల్‌లో భారత అగ్రస్థానం మరింత పదిలం కాదు. డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే తర్వాత ఆడే 8 మ్యాచ్‌ల్లో తప్పక 6 మ్యాచ్‌లు గెలవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.నిరసన సెగ..హిందూ మహా సభ నిరసన సెగతో కాన్పూర్ మైదానం వద్ద భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నాయనే కారణంతో ఈ సిరీస్‌ను అడ్డుకోవాలని హిందూ మహాసభ నిరసనలు చేపట్టాలని నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. హిందూమహా సభ ఉపాధ్యక్షుడు జయవీర్ భరద్వాజ్ నిరసనలు గురించి మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై, దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని, దీనికి వ్యతిరేకంగా గ్వాలియర్‌లో నిరసనలు చేపడతామని చెప్పారు.గ్వాలియర్ వేదికగా తొలి టీ20 జరగనుంది. అయితే కాన్పూర్‌లోనూ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. హోటల్ నుంచి మైదానం వరకు, ఇరు జట్ల ఆటగాళ్లకు మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నామని కాన్పూర్ పోలీస్ కమీషనర్ హరీష్ చందర్ చెప్పారు. యాంటీ టెర్రరిజం స్క్వాడ్‌క భద్రత బాధ్యతలు చూస్తాయని తెలిపారు. నిరసనలు తెలిపేందుకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.స్టేడియంలో రిపేర్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. స్టేడియంలోని సీ బాల్కానీ సీట్లను పూర్తిగా అమ్మలేదని తెలుస్తోంది. కొన్ని టికెట్స్ మాత్రమే అమ్మినట్లు స్టేడియం వర్గాలు పేర్కొన్నాయి.

# క్రికెట్‌లో మోస్ట్ కాంట్రవర్షియల్ మ్యాచ్..
## సచిన్‌ను కోర్టుకు లాగిన ఘటన! ఏంటీ మంకీగేట్?



క్రికెట్ ఫీల్డ్‌లో గొడవలు కొత్తేమీ కాదు. హై-ఇంటెన్స్ మ్యాచుల్లో ఆటగాళ్ల మధ్య ఘర్షణలు జరగడం కామన్. తిట్టుకోవడాలు, ఒకరిపై ఒకరు దూసుకెళ్లడాలు, రెచ్చగొట్టుకోవడాలు చూస్తూనే ఉంటాం.ఇది పార్ట్ ఆఫ్ గేమ్‌గా మారిపోయింది. ఇలాంటి వివాదాల్లో ఇరుక్కున్న ప్లేయర్లు బ్యాడ్ ఇమేజ్‌తో కెరీర్‌లో అనవసర మచ్చ తెచ్చుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. క్రికెట్‌లో ఎన్ని వివాదాలు ఉన్నా.. మోస్ట్ కాంట్రవర్షియల్ మ్యాచ్ అంటే మాత్రం ఠక్కున గుర్తుకొచ్చేది సిడ్నీ టెస్టే. 2008లో భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన ఈ మ్యాచ్‌ను క్రికెట్ వరల్డ్ ఎప్పటికీ మర్చిపోదు. ‘మంకీగేట్’ వివాదం జరిగింది ఈ మ్యాచ్‌లోనే. సుదీర్ఘ కెరీర్‌లో ఒక్క రిమార్క్ కూడా లేని బ్యాటింగ్ గ్రేట్ సచిన్ టెండూల్కర్‌ను కోర్టుకు లాగిన ఘటన ఇదే మ్యాచ్‌లో చోటుచేసుకుంది. దీని గురించి మరింత వివరంగా తెలుసుకుందాం..2008లో నాలుగు టెస్టుల సిరీస్ కోసం ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లింది టీమిండియా. అయితే మొదటి టెస్ట్‌లోనే భారత్‌కు గట్టి షాక్ తగిలింది. ఏకంగా 337 పరుగుల భారీ తేడాతో కంగారూల చేతుల్లో ఓడిపోయింది మెన్ ఇన్ బ్లూ. దీంతో రెండో టెస్ట్‌లో ఆసీస్‌ను మట్టికరిపిద్దామనుకుంటే చెత్త అంపైరింగ్ మన జట్టుకు శాపంగా మారింది. అయినా భారత ఆటగాళ్లు పట్టుదలతో ఆడారు. ఎలాగైనా గెలవాలనే కసితో ఆడారు. సిడ్నీ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో కంగారూ టీమ్ 463 రన్స్ చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ స్టార్ట్ చేసిన కుంబ్లే సేన ఒక దశలో 116 ఓవర్లకు 7 వికెట్ల నష్టానికి 451 పరుగులతో పటిష్టంగా ఉంది. అప్పటికే సెంచరీ కంప్లీట్ చేసి మంచి ఊపు మీదున్నాడు సచిన్ టెండూల్కర్. ఆ దశలో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. టర్బనేటర్ హర్భజన్ సింగ్, ఆసీస్ ఆల్ రౌండర్ ఆండ్రూ సైమండ్స్ మధ్య జరిగిన వాదులాట కాస్తా బిగ్ కాంట్రవర్సీగా మారి క్రికెట్ వరల్డ్‌ను ఊపేసింది.టీమిండియా బాగా ఆడుతుండటం, సచిన్ ఎంతకీ ఔట్ కాకపోవడంతో ఆస్ట్రేలియా జట్టు టెన్షన్ పడసాగింది. ఈ తరుణంలో భజ్జీదగ్గరకు వచ్చిన సైమండ్స్ ఏదో అన్నాడు. హర్భజన్ కూడా వెనక్కి తగ్గలేదు. ఆల్‌రౌండర్‌కు ఇచ్చిపడేశాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి అది కాస్తా జాతి వివక్ష వివాదంగా మారింది. ఆ టైమ్‌లో భజ్జీతో పాటు మరో ఎండ్‌లో ఉన్న సచిన్ గొడవ చూసి వెంటనే హర్భజన్‌ను ఆపేందుకు ప్రయత్నించాడు. సైమండ్స్‌కు కూడా సర్దిచెప్పాలని చూశాడు. అయితే ఆసీస్ టీమ్ ఆ ఫైట్‌ను అక్కడితో వదిలేయలేదు. ఆ తర్వాత కంగారూ కెప్టెన్ రికీ పాంటింగ్ వచ్చి భజ్జీని గెలికాడు.మ్యాచ్ ముగిసిన తర్వాత ఈ ఘటనపై రిఫరీ మైక్ ప్రోక్టర్ 4 గంటల పాటు విచారణ జరిపాడు. ఈ ఇన్వెస్టిగేషన్‌కు ఆసీస్ నుంచి సైమండ్స్‌తో పాటు పాంటింగ్, క్లార్క్, హేడెన్ అటెండ్ అయ్యారు. భారత టీమ్ నుంచి సచిన్, భజ్జీ హాజరయ్యారు. విచారణ తర్వాత ప్రోక్టర్ తన డెసిషన్ చెప్పాడు. హర్భజన్ తప్పు చేశాడని, ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని లెవల్ 3ను ఉల్లంఘించాడని తేల్చాడు. ఈ నేరం కింద అతడి మీద మూడు టెస్టుల పాటు బ్యాన్ విధిస్తున్నట్లు ప్రకటించాడు. దీన్ని భారత మేనేజ్‌మెంట్ ఊహించలేదు. అతడిపై విధించిన బ్యాన్‌ను కూడా ఎత్తివేసింది. దానికి బదులు మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించారు. దురదృష్టవశాత్తూ రెండేళ్ల కింద సైమండ్స్ చనిపోయాడు. అయినా రెండు జట్ల మధ్య యుద్ధ వాతావరణం రాజేసిన ఈ మంకీగేట్ కాంట్రవర్సీని మాత్రం క్రికెట్ లవర్స్ ఇంకా మర్చిపోలేదు.